

RNI NO: APTEL/25/A4894

ఉషశ్రీ

USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిస్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 73 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిల్ల మోహన్ | ఆదివారం 24 - 05 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

వాళ్లే అదృష్టవంతులు

- ఆహారమే ఆరోగ్యానికి అసలైన ఔషధమన్న చంద్రబాబు.....
- యోగా, ధ్యానం జీవనశైలిలో భాగం కావాలన్న సీఎం
- 'సంజీవని'తో డిజిటల్ ఆరోగ్య సేవలు ప్రజలకు.....
- రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి సంజీవని అమలు
- ఇంటివద్దే 42 రకాల వైద్య పరీక్షలు నిర్వహణ.....
- ప్రతి వ్యక్తికి ఏఐ డాక్టర్ సేవలు అందిస్తామన్న సీఎం....
- వైద్యం, సాగునీటి ప్రాజెక్టులకు భారీ ప్రాధాన్యత.....

నా వరకు నేను ఆహార నియమాలు పాటిస్తాను: సీఎం చంద్రబాబు

చిత్తూరు జిల్లా కండ్రిగలో సంజీవని కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

"ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సీఎం వివరించారు. "రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

ఏఐ సాయంతో వైద్యం

- చిత్తూరులో సంజీవని పీహెచ్‌సీని పరిశీలించిన చంద్రబాబు
- డిజిటల్ వైద్య సేవల పనితీరుపై సీఎం సమీక్ష
- ఏఐ సాయంతో రోగ నిర్ధారణ విధానం ప్రదర్శన
- వర్చువల్ కాన్ఫరెన్స్‌లో నిపుణ వైద్యులతో చర్చ

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యాధునిక సాంకేతికతతో వైద్య సేవలు అందించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం చిత్తూరు జిల్లాలో పర్యటించారు. యాదమరి మండలంలోని 'సంజీవని' ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న డిజిటల్ వైద్య సేవల పనితీరును స్వయంగా సమీక్షించారు. టెక్నాలజీని అనుసంధానించి సామాన్యులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే అంశాన్ని క్షుణ్ణంగా అడిగి

సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నాడు

- తాను మంచోడినంటూ జగన్ సొంత డబ్బా కొట్టుకుంటున్నాడన్న కేశవ్
- ఆయన బాధితుడు కాదు, నేర చరిత్ర కలిగిన నిందితుడు అని విమర్శలు
- ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబమే అని ఆరోపణ
- రాజారెడ్డి అకృత్యాలపై త్వరలో సమగ్ర పుస్తకం విడుదల చేస్తామని వెల్లడి
- గొడ్డలి పార్టీ విధ్వంసం చేస్తే, కూటమి ప్రభుత్వం నిర్మాణం చేస్తోందని ఉద్ఘాటన

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ : తనకంటే మంచోడు లేడంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ 'సెల్ఫ్ సర్టిఫికెట్లు' ఇచ్చుకోవడం విడ్డూరంగా ఉందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా ఎద్దేవా

మహానాడు పండుగలా జరపాలి

- అందరం కలిసికట్టుగా పనిచేయాలి: మంత్రి నారా లోకేశ్
- ఈ నెల 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు
- క్లస్టర్ల స్థాయిలో వర్చువల్‌గా హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహణ
- 'స్త్రీ శక్తి మహానాడు' థీమ్‌తో కార్యక్రమాలు....
- పార్టీ శ్రేణులను ఏకం చేసి, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని లోకేశ్ పిలుపు
- మహానాడు విజయవంతానికి ఐక్యంగా పనిచేయాలని దిశానిర్దేశం...

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడును ఈసారి క్లస్టర్ల స్థాయిలో ఒక పండుగ వాతావరణంలో, కలిసికట్టుగా విజయవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. హైబ్రిడ్ విధానంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు సన్నాహకాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ ఇంఛార్జ్‌లతో ఆయన ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈసారి మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు' అనే థీమ్‌తో

శాంతిదూత ముసుగు ధరించాడు

- పయ్యావుల కేశవ్ తో కలిసి సీఎం రమేష్ ప్రెస్ మీట్
- మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు
- శాంతిదూత ముసుగు వేసుకుని జగన్ కొత్త నాటకానికి తెరలేపారని వ్యాఖ్యలు...
- జగన్ తాత రాజారెడ్డిపై అధికారికంగా రౌడీ షీట్ ఉందని వెల్లడి...
- వివేకా హత్యపై ఓపెన్ పోల్ పెడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్....

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

వైసీపీ అధినేత జగన్ ఒక నటుడు, క్రిమినల్ అని, ఇప్పుడు హఠాత్తుగా శాంతిదూత ముసుగు వేసుకుని ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం విజయవాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ఒక నేరస్తుడు అనే నింద జనాల్లోకి బలంగా వెళ్లిందని, ఇప్పుడా నింద నుంచి తప్పించుకునేందుకే జగన్ ప్రెస్ మీట్లు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి మంచి పనులు చేస్తే క్రిమినల్ ముద్ర పోతుంది కానీ, ప్రెస్ మీట్లలో పచ్చి అబద్ధాలు చెబితే పోదని హితవు పలికారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ.. "కరడుగట్టిన నేరస్థులకు కూడా తట్టని కుట్రలు, కుతంత్రాలతో వైఎస్ కుటుంబం పులివెందులలో ఒక అరాచక సామ్రాజ్యాన్ని నిర్మించింది. జగన్ తాత రాజారెడ్డిపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పోలీస్ రికార్డుల్లో అధికారికంగా రౌడీ షీట్ నమోదైంది. ఒక కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించడం, ఒక మైనింగ్ యజమానిని దారుణంగా హత్య చేసి ఆ గనులను అక్రమంగా చేజిక్కించుకోవడం వంటి చర్యలతో రాజారెడ్డి డబ్బు కూడగట్టారు. పులివెందుల సమీపంలోని పార్నపల్లి గ్రామంలో ఆయన అరాచకాలకు

శాంతిదూత ముసుగు ధరించాడు

నేటికీ సజీవ సాక్ష్యాలు ఉన్నాయి" అని ఆరోపించారు. తన రాజకీయ లబ్ధి కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డిల మరణాలను జగన్ వేర్వేరుగా వాడుకుంటూ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సీఎం రమేష్ విమర్శించారు. "వివేకా హత్య కేసులో సీబీఐ లోతుగా దర్యాప్తు చేసి వైఎస్ భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసింది. ఈ హత్య వెనుక జగన్ హస్తం ఉందా లేదా అనే అంశంపై రాష్ట్రంలో ఓపెన్ పోల్ నిర్వహించాలి. ఒకవేళ ఆ పోల్‌లో జగన్‌కు ఎలాంటి సంబంధం లేదని తేలితే నేను రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటా" అని సవాల్ విసిరారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాలపై పూర్తి అవగాహన వచ్చిందని, అందుకే ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇప్పుడు తాను చాలా మంచివాడినని చెప్పుకుంటూ జగన్ నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి మేధావులు కూడా పొంతన లేని వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో తమకున్న విశ్వసనీయతను పూర్తిగా కోల్పోతున్నారని సీఎం రమేష్ విమర్శించారు.

మహానాడు పండుగలా జరపాలి

నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

హైబ్రిడ్ విధానంలో నిర్వహణ: వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో అత్యంత ఘనంగా మూడు రోజుల పాటు నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునకు స్పందించి, ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడును రెండ్రోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు లోకేశ్ వివరించారు. దీని ప్రకారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ కేంద్రాల్లో వర్చువల్‌గా మహానాడు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి క్లస్టర్ కేంద్రంలో ఎల్ఈడీ టీవీ, స్పీకర్లు వంటి సాంకేతిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

క్లస్టర్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం: ఈ మహానాడును క్లస్టర్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఒక మంచి అవకాశంగా ఉపయోగించుకోవాలని లోకేశ్ అన్నారు. "క్లస్టర్ ఇంఛార్జ్‌లకు ఎక్కువ బాధ్యత ఇవ్వాలన్నది పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశం. ఈ వ్యవస్థ ద్వారానే మనం ముందుకు వెళ్లాలి" అని ఆయన పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలోని కుటుంబ సాధికార సారథి (కేఎస్-ఎస్) నుంచి బూత్ ఇంఛార్జ్‌లు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల సభ్యుల వరకు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. హాజరును 'మై టీడీపీ' యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి: ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో, త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని లోకేశ్ గుర్తుచేశారు. ఇందుకు మహానాడును ఒక వేదికగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీలో వ్యక్తులు శాశ్వతం కాదని, వ్యవస్థే శాశ్వతమని, ఆ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకే క్లస్టర్ ఇంఛార్జ్‌లకు అవకాశం కల్పించామని అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి పనితీరును 'మై టీడీపీ' యాప్ ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లతో సమన్వయం చేసుకుంటూ, ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి మహానాడును చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు, జోనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఇరాన్‌పై దాడికి అమెరికా సిద్ధం

- ఇరాన్‌పై దాడులకు సిద్ధమవుతున్నట్టు గతకొంతకాలంగా వార్తలు
- ఈసారి ట్రంప్ సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం
- ఇరాన్ మళ్లీ డ్రోన్ల తయారీ కేంద్రాలను పునరుద్ధరించినట్లు వార్తలు
- దాన్ని తిప్పికొట్టేందుకు తప్పని పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం

జాతీయం : అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధ మేఘాలు ఈసారి మరింత తీవ్రంగా కమ్ముకుంటున్నట్లు సమాచారం అందుతోంది. గత కొంతకాలంగా దాడుల గురించిన ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ప్రస్తుత దౌత్య చర్చలు విఫలమైతే ఇరాన్‌పై సరికొత్త సైనిక దాడులు చేయడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ వివాదానికి శాశ్వతంగా ముగింపు పలికేలా ఒకే ఒక్క భారీ నిర్ణయాత్మక దాడి చేసేందుకు ఆయన మొగ్గు చూపుతున్నట్లు వాషింగ్టన్ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై శుక్రవారం ఉదయం తన జాతీయ భద్రతా బృందంతో ట్రంప్ అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించి, సైనిక పరమైన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ట్రంప్ తన వీకెండ్ ప్లాన్స్‌ను మార్చుకొని వాషింగ్టన్‌లోనే ఉండిపోయారు. తన పెద్ద కుమారుడి వివాహ వేడుకకు కూడా వెళ్లకుండా వైట్‌హౌస్‌కే పరిమితం కావడం అక్కడి తాజా పరిస్థితికి అద్దం పడుతోంది. మరోవైపు ఈ ఉద్రిక్తతలను తగ్గించడానికి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్, ఖతార్ ప్రతినిధుల బృందం టెహ్రాన్‌లో చివరి ప్రయత్నంగా మధ్యవర్తిత్వ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ చర్చల ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతుండటంతో ట్రంప్‌లో అసహనం పెరుగుతోందని, అమెరికా పంపిన 'చివరి ప్రతిపాదన'ను తిరస్కరిస్తే సైనిక చర్య తప్పదంటూ ఇరాన్‌ను ఇప్పటికే హెచ్చరించినట్లు సమాచారం వినిపిస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్‌తో మూడు నెలల పాటు జరిగిన యుద్ధం ముగిసిన కొన్ని వారాల్లోనే ఇరాన్ మళ్లీ తన డ్రోన్ల తయారీ కేంద్రాలను పునరుద్ధరిస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలు గుర్తించాయని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే 24 గంటల్లో చర్చలు ఏదో ఒక కొలిక్కి రాకపోతే.. అమెరికా ఏ క్షణమైనా ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందనే వార్తలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి.

ఏఐ సాయంతో వైద్యం

తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఒక రోగి పీహెచ్‌సీకి వచ్చినప్పటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుని వెళ్లేంత వరకు జరిగే పూర్తి ప్రక్రియను సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా వీక్షించారు. ముందుగా, పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ (పీసీసీ) డెస్క్ వద్ద డిజిటల్ పద్ధతిలో రోగి వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్, విజిట్ రికార్డుల జనరేషన్, రోగుల సేవల మ్యాపింగ్ వంటి అంశాలను అక్కడి సిబ్బంది సీఎంకు వివరించారు. అనంతరం పీహెచ్‌సీ డ్యాష్‌బోర్డును పరిశీలించి, రోజువారీగా నమోదవుతున్న మొత్తం రిజిస్ట్రేషన్లు, కన్సల్టేషన్ల వివరాలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ట్రాక్ చేస్తున్న విధానంపై అధికారులతో చర్చించారు. ఆ తర్వాత స్టాఫ్ నర్స్ స్టేషన్‌కు వెళ్లి, రోగుల బీపీ, ఎత్తు, బరువు, శరీర ఉష్ణోగ్రత, హార్ట్ బీట్, పల్స్ రేట్ వంటి కీలక వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఇక్కడి నుంచి అత్యంత కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అసిస్టెడ్ కన్సల్టేషన్ విధానాన్ని వీక్షించారు. మెడికల్ ఆఫీసర్ ఒక రోగి పాత ఆరోగ్య చరిత్రను సేకరించడం, నర్సులు నమోదు చేసిన వివరాలను తనిఖీ చేయడం, ఏఐ సపోర్ట్‌తో వ్యాధి నిర్ధారణకు సహకారం తీసుకోవడం వంటివి లైవ్‌లో ప్రదర్శించారు. ఈ టెక్నాలజీ వల్ల డాక్యుమెంటేషన్ భారం గణనీయంగా తగ్గి, రోగులపై ఎక్కువ సమయం కేటాయించేందుకు వీలవుతుందని వైద్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ జనరేషన్ ప్రక్రియలను కూడా సీఎంకు చూపించారు. అనంతరం ఫార్మసీ విభాగాన్ని సందర్శించిన చంద్రబాబు, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగా రోగులకు వేగంగా మందులు పంపిణీ చేస్తున్న విధానాన్ని చూశారు. చివరిగా, పీహెచ్‌సీలోని వర్చువల్ రూమ్ నుంచి 'సంజీవని' ప్లాట్‌ఫామ్ ద్వారా కుప్పం ఏరియా ఆసుపత్రి, బెంగళూరులోని టాటాఎండీకి చెందిన నిపుణులైన వైద్యులతో వర్చువల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వైద్య అంతరాలను తగ్గించడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది పనితీరును అభినందించారు.

సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నాడు

చేశారు. జగన్ ఎన్నటికీ బాధితుడు కాదని, ఆయనో నేర చరిత్ర కలిగిన నిందితుడని సంచలన ఆరోపణలు చేశారు. తనపై జరిగిన క్రిమినల్ చర్యలను కప్పిపుచ్చుకునేందుకే జగన్ శాంతిదూతలా నటిస్తున్నారని విమర్శించారు. శనివారం విజయవాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ, బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

జగన్‌ది నేర చరిత్ర.. ఫ్యాక్షన్‌కు ఆద్యులు వారే: ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, "జగన్ బెంగళూరు ప్యాలెస్ నుంచి ఏపీకి వచ్చినప్పుడల్లా కొత్త వాదనలు తెరపైకి తెస్తారు. నిన్నటికి నిన్న ప్రెస్ మీట్ పెట్టి తనకంటే ఉత్తముడు, మంచోడు లేడంటూ సొంతంగా సర్టిఫికెట్ ఇచ్చుకున్నారు. సొంత బాబాయ్ వివేకాపై గొడ్డలివేటు వేసి, దాన్ని గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన జగన్ చరిత్ర రాష్ట్రంలో నిక్కరు వేసుకునే పిల్లాడిని అడిగినా చెబుతాడు. అలాంటి సున్నితమైన విషయంలోనూ పచ్చి అబద్ధాలతో పబ్బం గడుపుకుంటున్నారు" అని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి నేరమయ, ఫ్యాక్షన్ సంస్కృతిని ప్రవేశపెట్టిందే వైఎస్ కుటుంబమని పయ్యావుల ఆరోపించారు. "కేవలం కొన్ని వర్గాలకే పరిమితమైన కక్షలను వ్యవస్థీకృతం చేసి రాజకీయాల్లోకి తెచ్చిన ఘనత జగన్ తాత రాజారెడ్డిది. 1989లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాయలసీమలో ఫ్యాక్షనిజానికి అధికార అండదండలు లభించాయి. పులివెందుల నియోజకవర్గంలోని పార్నపల్లి గ్రామంలో టీడీపీకి మెజార్టీ వచ్చిందన్న ఒకే ఒక్క కారణంతో, ఆ గ్రామ నేతల ఇళ్లకు డ్రిల్లింగ్ చేసి డైనమైట్లతో పేల్చివేసిన భయానక చరిత్ర వారిది. ఈ ఘటనను రాయలసీమ ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. ప్రత్యర్థులపై దాడి చేయించి, తాము వేరే ప్రాంతంలో ఉన్నట్టుగా ఎలిబీ సృష్టించుకునే కొత్త నేర సంస్కృతి వారిదే. పులివెందులలో రాజారెడ్డి హయాంలో సాగిన అంచాలు, వాత్యారాజకీయాలపై త్వరలోనే సమగ్ర ఆధారాలతో ఒక పుస్తకాన్ని తీసుకువస్తాం" అని పయ్యావుల ప్రకటించారు.

నాడు విధ్వంసం.. నేడు నిర్మాణం: జగన్ ఐదేళ్ల పాలనలో ప్రతి వ్యవస్థ, ప్రతి రంగం, ప్రతి ప్రాంతంపైనా గొడ్డలివేటు వేశారని, అందుకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని 'గొడ్డలి పార్టీ' అనాల్సి వస్తోందని పయ్యావుల విమర్శించారు. "ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అయ్యాకే రాయలసీమలో ఫ్యాక్షనిజం అంతమైంది. జగన్ తన పాలనలో పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారు. అచ్చెన్నాయుడి నుంచి చంద్రబాబు దాకా అరెస్టులతో రాష్ట్రంలో భయోత్పాతాన్ని సృష్టించారు. నాడు జగన్ పొక్లెయిన్లను విధ్వంసానికి వాడితే, నేడు కూటమి ప్రభుత్వం అదే పొక్లెయిన్లను రాష్ట్ర పునర్నిర్మాణానికి వినియోగిస్తోంది. సుమారు 800 పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శరవేగంగా అడుగులు వేస్తున్నాం. యువత వైఎస్ ఫ్యామిలీ విధ్వంసకర చరిత్రను తెలుసుకోవాలి," అని పిలుపునిచ్చారు.

తండ్రినే ముద్దాయిని చేసిన ఘనత జగన్‌ది: వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కోర్టు కేసుల్లో ముద్దాయిగా మార్చింది స్వయంగా జగనేనని, ఈ నిజాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా చెప్పారని పయ్యావుల గుర్తుచేశారు. "నాడు వైఎస్సార్‌ను కోర్టులో ముద్దాయిగా చేర్చిన లాయర్ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి జగన్ తన ప్రభుత్వంలో ఉన్నత పదవి ఇచ్చి సత్కరించారు. వైఎస్సార్ మరణం వెనుక రిలయన్స్ హస్తం ఉందని ఆరోపించి, ఆ తర్వాత అదే సంస్థకు చెందిన వ్యక్తికి రాజ్యసభ సీటు ఎలా ఇచ్చారు? వైఎస్ మరణం వెనుక జగన్ పాత్ర ఉందని మంత్రిగా ఉన్నప్పుడు బొత్స సత్యనారాయణ అన్నారు, దానికి జగన్ సమాధానం చెప్పగలరా?" అని పయ్యావుల ప్రశ్నించారు. వైఎస్సార్ పాదయాత్రలో అస్వస్థతకు గురైతే తల్లి విజయమ్మ పరామర్శించారు గానీ జగన్ వెళ్లలేదని, వివేకాను చంపిందెవరో ఆయన కుమార్తె సునీత చెబుతుంటే జగన్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని నిలదీశారు. నేరం చేయడమే నైజంగా మార్చుకున్న గొడ్డలి పార్టీ సమాజానికి అత్యంత హానికరమని ఆయన హెచ్చరించారు.

వాళ్లే అదృష్టవంతులు

త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా కూడా వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఏఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు. వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తుచేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీఎం అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తిచేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా

నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లెమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు.

ఆకివీడులో వ్యాపారస్తులకు అవగాహన సదస్సు నిర్వహించిన సిఐ కాళీ చరణ్

ఆకివీడు: (ఉషశ్రీ) మే 23 పార్కింగ్ విషయంలో వ్యాపారస్తులు షాపు వద్ద ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కాళీ చరణ్ . చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం ఫెర్టిలైజర్స్ భవనంలో వ్యాపారస్తులకు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య వక్తగా సిఐ కాళీ చరణ్ మాట్లాడుతూ.. వ్యాపారస్తులకు సైబర్ నేరగాళ్ల ఏ విధంగా మోసాలకు పాల్పడతారో వ్యాపారస్తులకు వివరించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఆకివీడు ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంటోందని, వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ అధికారులు తెలిపిన ముందర ఉన్న మార్జిన్ దాటి వాహనాలు నిలుపరాధన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్య రాకుండా వ్యాపారస్తులందరూ సహకరించాలని కోరారు. అనంతరం వ్యాపారస్తులు ట్రాఫిక్ విషయంలో వారి వారి సూచనలు సిఐ కాళీ చరణ్ కు తెలిపారు ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల సత్యనారాయణ రాజు, గుర్రం శ్రీనివాస్, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత ప్రజలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి

ఆకివీడు: (ఉషశ్రీ) మే 23 పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలంలోని మూడు గ్రామంలో పేదలు ఇల్లు కూల్చిన ప్రాంతాలను వ్యవసాయ కార్మిక సంఘం కులక్షత లేక పోరాట సంఘం వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రతినిధి బృందం కూల్చిన ఇళ్లను పరిశీలించడం జరిగింది సిద్దాపురం గ్రామంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఇళ్లను అర్ధరాత్రి కూల్చివేశారు. కనీసం పేదలు వంట సామాన్లు కట్టుబట్టలను కూడా తీసుకోవడానికి అవకాశం ఇవ్వకుండా బుల్డోజర్ల పెట్టి అత్యంత దారుణంగా కూల్చారు వారిలో కొంతమంది ఆ గ్రామంలో రోడ్డుపై రేకులేసుకుని ఎర్రటి ఎండలో జీవనం కొనసాగిస్తూ అనేక జబ్బులకు గురవుతున్నారు. వారికి తాగడానికి మంచి నీళ్లు పనిచేయడానికి పనులు లేవు వృద్ధుల ఆ ఎండకు తట్టుకోలేక చావు బతుకుల మధ్య మలమల్లలాడుతున్నారు ఆ ఇళ్లను పరిశీలించగా దుర్భర పరిస్థితుల్లో పేదలు ఉంటున్నారు. వారంతా కూలి నాలి చేసుకునే పేదలు ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయం స్థలము చూపించి ఇల్లు కట్టకపోతే వాళ్ళ కుటుంబాలన్నీ వీధిన పడతాయి. రాష్ట్రంలో ఇంత దుర్మార్గమైన ఘటన ఎక్కడ జరిగింది చూడలేదు రఘురామకృష్ణమరాజు అత్యంత దారుణంగానికి పాల్పడ్డారు ఈ ఊరే కాదు ఈ నియోజకవర్గంలో 12 గ్రామాల్లో సుమారు 2000 పేదల గుడిసెలను కూల్చివేసి ఆ స్థలాలను అమ్ముకోవడానికి తీవ్రమైన కుట్ర చేస్తున్నట్లు కూడా పేదలు చెబుతున్నారు. కాబట్టి ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా ఈనెల 28 విజయవాడలో భారీ చర్చ వేదిక నిర్వహించి ప్రభుత్వం స్పందించే పేదలకు కట్టించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి వెంకటేశ్వర్లు ఆంధ్ర మాల్యాద్రి వెంకట్రావు తో పాటు స్థానిక నాయకులు తవిటి నాయుడు గొర్ల రామకృష్ణ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దశేష వాహనంపై వైకుంఠనాధుడి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ గోవిందరాజస్వామి

తిరుపతి, (ఉషశ్రీ)మే 23: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవంలో తొలి రోజు రాత్రి పెద్దశేష వాహనసేవ వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి టెంపుల్ ఉత్సవమూర్తులు వైకుంఠనాధుడి అలంకారంలో భక్తులకు దివ్య మంగళ దర్శనం ఇచ్చారు. ఆదిశేషునిపై శేషశాయిగా వెలసిన స్వామివారు అపూర్వ దివ్యకాంతులతో భక్తులను పరవశింపజేశారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందుండగా మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు, గోవింద నామస్మరణల నడుమ స్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు కనువిందు చేశారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు సమర్పిస్తూ, కర్పూర హారతులు ఇస్తూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని సేవించుకున్నారు. గోవింద నామాలతో మారుమోగిన తిరుపతి మాడవీధులు ఆధ్యాత్మిక పారవశ్యానికి నిలయంగా మారాయి. ఆగమ పండితుల ప్రకారం శేషుడు స్వామివారికి మంచం, పరుపు, ఛత్రంగా సేవలందిస్తూ "శేషశాయి" మహిమను సార్థకం చేస్తున్నాడు. శేషవాహన సేవ ద్వారా "శేషునిలా నిత్యం భగవంతునికి సేవ చేస్తూ ధర్మమార్గంలో నడిచే వారికి దైవానుగ్రహం లభిస్తుంది" అనే ఆధ్యాత్మిక సందేశాన్ని స్వామివారు భక్తులకు బోధిస్తున్నారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఉదయం చిన్న శేష వాహనంపై, రాత్రి హంస వాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు, రంజిత్, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు నారాయణవనంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి, (ఉషశ్రీ)మే 23: శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించనున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ పవిత్రత, శోభను మరింత పెంపొందించే ఉద్దేశంతో ఈ శుద్ధి మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పవిత్ర కార్యక్రమం జరగనుంది. మే 28 నుంచి జూన్ 5 వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ శుద్ధి కార్యక్రమంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని ప్రత్యేక శుద్ధి జలాలతో పరిశుభ్రం చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలను కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేయనున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

త్రీ వీలర్ స్కూటర్లను పంపిణి

కార్యక్రమంలో పాల్గొన్న ముత్తుముల

గిద్దలూరు, ఉషశ్రీ : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు (వికలాంగులకు) మోటరైజెడ్ త్రీ వీలర్ వాహనాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డోల బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ విజయ సునీత ,ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి , మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి , మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ , ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు లతో కలిసి గిద్దలూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తుముల ఆశోక్ రెడ్డి పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే ఆశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిద్దలూరు నియోజకవర్గంలోని 10 మంది విభిన్న ప్రతిభవంతులను గుర్తించి త్రీ వీలర్ మోటర్ స్కూటర్లను ఎన్డీయే కూటమి ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు వారి కష్టాలను గుర్తించి వారు కూడా అందరిలాగా వాళ్ళ పనులు వాళ్ళు చేసుకొనుటకు ఈ వాహనాలు ఉపయోగించుకోవాలి అనే ఉద్దేశంతో ఇవ్వడం జరిగిందని తెలిపారు.

లబ్ధి పొందిన వివరాలు పది మంది వివరాలు.

1. గంగుల పద్మావతి భర్త పిచ్చి రాజయ్య, అర్ధవీడు మండలం అచ్చంపేట గ్రామం.
2. మొర్రబోయిన భాగ్య లక్ష్మమ్మ, భర్త అచ్చయ్య, అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామం.
3. రగులకొల్లు సాలమ్మ భర్త రామసుబ్బయ్య, కంభం మండలం తూరిమెళ్ల గ్రామం.
4. యామ భూలక్ష్మి భర్త వెంకటేశ్వర్లు బెస్తవారిపేట మండలం నేకునంబాడు గ్రామం.
5. మరల బత్తుల సుచిత్ర, భర్త కృష్ణ, రాచెర్ల మండలం అక్క పల్లె గ్రామం.
6. చిలకా శ్రీను తండ్రి కుశలయ్య గిద్దలూరు మండలం కృష్ణం శెట్టిపల్లె గ్రామం.
7. తాటగిరి పుష్పరాజ్ తండ్రి దానం గిద్దలూరు మండలం ఓబులాపురం గ్రామం.
8. మోడీ రంగస్వామి నాయక్ తండ్రి పిచ్చన్న, గిద్దలూరు మండలం వేల్లుపల్లి గ్రామం.
9. గుండ్రెడ్డి రమణయ్య తండ్రి చిన్న వెంకటయ్య గిద్దలూరు మండలం త్రిపురాపురం గ్రామం.
10. కందుల మురళీమోహన్ రెడ్డి తండ్రి రామిరెడ్డి మండలం పురుషోత్తం పల్లె గ్రామం.

లబ్ధిదారులు మాట్లాడుతూ మమ్మల్ని గుర్తించి మాకు త్రీ వీలర్స్ స్కూటర్లు సహాయం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కు, గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుమల అశోక్ రెడ్డి కు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమాఖ్య

మంగళగిరి, (ఉషశ్రీ) మే 23 గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్యా ఆధ్వర్యంలో డోలాస్ నగర్‌లో శుక్రవారం గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ నేతృత్వంలో జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమాఖ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. మంగళగిరి, తుళ్ళూరు, పెదకాకాని, అమరావతి, తెనాలి, చేబ్రోలు, తాడికొండ మండలాల నుంచి వచ్చిన బాలల పార్లమెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి బాలల పార్లమెంట్ మంత్రులను జిల్లా స్థాయి సమాఖ్య సభ్యులుగా ఎన్నుకొన్నారు. ఎన్నుకోబడిన సభ్యులు తమ తమ మండలాల్లో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా పనిచేయనున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న క్రాఫ్ డైరెక్టర్ డా. ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమాఖ్య అనేది గ్రామాలు, మండలాల నుంచి వచ్చిన బాలల నాయకులకు ఒక సమష్టి వేదిక అని తెలిపారు. ఈ వేదిక ద్వారా బాలలు తమ హక్కులు, అవసరాలు, సమస్యలు, అభిప్రాయాలను ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, సమాజానికి తెలియజేయగలరని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ఇది బలమైన వేదికగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం నందిగామ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బుల్లా విజయ్ రాఘవ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్లో సామాజిక అవగాహన పెంపొందిస్తూ నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమాఖ్య ఏర్పాటు కావడం సంతోషకరమని, పిల్లలు ధైర్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్, జెఎంజె, గమన, అమరావతి గుడ్ షెఫర్డ్, మంగళగిరి గుడ్ షెఫర్డ్ సంస్థల ప్రతినిధులు, సుపీరియర్ సిస్టర్ మెర్సీ జార్జ్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌కు చెందిన చైల్డ్ లైన్ సిబ్బంది జి. కోటేశ్వరరావు, వివిధ మండలాల బాలబాలికలు, గుడ్ షెఫర్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ నర్సాపురం లక్ష్యంగా

"ఆపరేషన్ క్లీన్ స్వీప్"

- పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత
- ప్రభుత్వ విప్ ఉ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్.
- సమిష్టి భాగస్వామ్యంతో సమస్యలేని పట్టణంగా నర్సాపురం రూపు దిద్దుకుంటుంది
- జాయింట్ కలెక్టర్ మరియు నరసాపురం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి....

నరసాపురం: (ఉషశ్రీ) మే 23 రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా నర్సాపురం పట్టణంలో శనివారం విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా పాల్గొని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. స్టీమర్ రోడ్డులో నిర్వహించిన ప్రత్యేక శుభ్రత కార్యక్రమంలో వీరిరువురు స్వయంగా చీపురు పట్టి రోడ్లను శుభ్రపరిచారు. చెత్త తొలగింపు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశుధ్య కార్మికులతో కలిసి పాల్గొని ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమానికి జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ నర్సాపురం పట్టణాన్ని స్వచ్ఛమైన, అందమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రజాప్రతినిధులు లేదా అధికారులతో మాత్రమే సాధ్యంకాదని, ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద చెత్తను సక్రమంగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు నరసాపురం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే 22 నుండి జూన్ 20, 2026 వరకు నాలుగు వారాల పాటు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరుతో ముమ్మర పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి వారంలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త తొలగింపు, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. రెండవ వారంలో ప్రధాన, ఉప డ్రైన్లలో పూడికతీత పనులు, ఇరుకు సందుల్లో శుభ్రత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మూడవ వారంలో నివాస మరియు వాణిజ్య సముదాయాలలో 100 శాతం తడి-పొడి చెత్త వర్గీకరణపై అవగాహన కల్పించడంతో పాటు బల్క్ వేస్ట్ ఉత్పత్తిదారులచే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల అమలుపై చర్యలు తీసుకుంటామని వివరించారు. నాలుగో వారంలో అన్ని పబ్లిక్ మరియు కమ్యూనిటీ మరుగుదొడ్ల సంపూర్ణ శానిటైజేషన్, చెత్త వేయబడే సమస్యాత్మక ప్రాంతాల నిర్మూలన, ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే 45 రోజులలో నర్సాపురం పట్టణాన్ని సమస్యలేని, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సముద్ర జీవుల వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత.

- తాబేలను ప్రేమిద్దాం - సంరక్షిద్దాం
- వన్యప్రాణి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- నరసాపురం శాసన సభ్యులు మరియు ప్రభత్వ విప్ బొమ్మిడి నాయకర్,
- జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి.

మొగల్తూరు: (ఉషశ్రీ) మే 23 తాబెళ్ళ సంరక్షణ పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి వుండాలని శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ అన్నారు. ప్రపంచ తాబెళ్ళ దినోత్సవం పుష్కరించు కొని శనివారం పేరుపాలెం బీచ్ లో అటవీ శాఖ సంరక్షించిన 55 ఆలివ్ రెడ్లీ తాబేలు పిల్లలను సముద్రంలోనికి వదిలే కార్యక్రమంలో నరసాపురం శాసన సభ్యులు మరియు ప్రభత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక శాసన సభ్యులు మరియు ప్రభత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, నర్సాపురం ఆర్డీవో దాసిరాజు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశా కిరణ్, తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ లు సామూహికంగా 55 ఆలివ్ రెడ్లీ తాబేలు పిల్లలను పేరుపాలెం బీచ్ వద్ద సముద్రంలోనికి వదిలారు. వదిలిన తాబేళు పిల్లలు సముద్రపు అలల వెంబడి సముద్రంలోకి సురక్షితంగా చేరుకున్నాయి. ప్రపంచ తాబేళ్ల దినోత్సవం లో భాగంగా "తాబెళ్లను ప్రేమిదాం" అనే అంశం పై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఆలివ్ రెడ్లీ తాబేళ్లు చాలా అరుదుగా కనిపించే జాతులలో ఒకటని అన్నారు. ఇటువంటి అరుదైన జాతులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు మీద ఉందని అన్నారు. సముద్ర తాబేళ్లను మరియు వాటి ఆవాసాలు అంతరించిపోకుండా కాపాడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్య ప్రాణి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అంతరించిపోతున్న మత్స్య సంపదను పెంపొందించాలని అందుకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కె.పి పాలెం, పేరుపాలెం బీచ్ లను అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. బీచ్ లను అభివృద్ధి చేసి సుందరీకరంగా తీర్చిదిద్ది నరసాపురంను టూరిజం హబ్ గా ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. టూరిజం అభివృద్ధి వలన గ్రామాలు అభివృద్ధి చెంది, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగ సమస్య నివారించవచ్చని అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అరుదుగా కనిపించే ఆలివ్ రెడ్లీ తాబేళ్ళు సంతతిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కాక, ప్రజలపై కూడా ఉందని అన్నారు. బియ్యపుతిప్ప నుంచి మోళ్ళపర్రు వరకు 18 కిలోమీటర్లు మేర తీరప్రాంతం వెంబడి 78 తాబెళ్ళు సముద్ర తీర ప్రాంతాలకు వచ్చి 8,620 గుడ్లు పెట్టాయని, వాటిలో కంపాస్ స్కీం క్రింద ఆలీవ్ రిడ్లీ డటిల్ కన్వర్జేషన్ స్కీం క్రింద పేరుపాలెం పెదమైనవారిలంక ప్రాంతాలలో తాబేళ్ల గుడ్ల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వాటిని పొదిగించి నేటి వరకు 5,164 తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదలడం జరిగిందని అన్నారు. ఇటువంటి అరుదైన జాతి ఒరిస్సా ప్రాంతంలోని ఎక్కువగా కనిపిస్తాయని, ప్రస్తుతం మన ఆంధ్రప్రదేశ్లో కూడా ఇటువంటి సంపద ఉండటం అదృష్టంగా భావించాలని అన్నారు. గుడ్లను సంరక్షించి సముద్రాలలో విడిచి పెట్టడం వలన 60 శాతం వరకు వీటి సంతత వృద్ధి చెందిందని అన్నారు. సముద్ర, మత్స్య సంపదను సంరక్షించుకోవడం వలన జాతీయ సంపదను పర్యవేక్షించుకున్న వారం అవుతామని అన్నారు. కళాశాల, పాఠశాల విద్యార్థులు, నెస్ట్ స్వచ్ఛంద సంస్థ వారి సహకారంతో బీచ్ లో ప్రతి శనివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టటం జరుగుచున్నదని అన్నారు. బీచ్ ఒడ్డున పడవేసిన ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు వంటి వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి వాటిని బయటకు పంపడం జరుగుతుందని అన్నారు. దీనివలన సముద్రపు జలాలు కలుషితం కాకుండా ఉంటాయని అన్నారు. నరసాపురం తీరప్రాంతంలోని బీచ్ లను సుందరీకరణ చేసి టూరిజన్ని అభివృద్ధి చేయటం వలన గ్రామాలు అభివృద్ధి చెంది, యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. అనంతరం శాసన సభ్యులు మరియు ప్రభత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, నర్సాపురం ఆర్డీవో దాసిరాజు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశా కిరణ్ లు బీచ్ లో టూరిజం బైకులపై కొద్దిసేపు రైడ్ చేసి పర్యాటకులను ఆకర్షించి, ఆనందోత్సాహాలను నింపారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ యం.కరుణాకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రాంప్రసాద్, స్పెస్ ఎన్జీవో కోఆర్డినేషన్ జిఎం కృష్ణారావు, టిడిపి ఇన్చార్జి నాయకులు రామరాజు, స్థానిక కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం విజయవంతం

భీమవరం:(ఉషశ్రీ) మే 23 ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం 5:30 గంటలకు స్థానిక ప్రకాశం చౌక్ నందు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గౌరవ స్పెషల్ ఆఫీసర్ ఉ ఆర్.డి.ఓ, మున్సిపల్ కమిషనర్ , అసిస్టెంట్ కమిషనర్ , ఎం.హెచ్.ఓ. మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారుల స్వీపింగ్, కాలువలలో పేరుకుపోయిన చెత్త, మురుగు మరియు వ్యర్థ పదార్థాల తొలగింపు చేపట్టడంతో పాటు రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రపరిచారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, పట్టణాన్ని పరిశుభ్రంగా మరియు ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా గౌరవ స్పెషల్ ఆఫీసర్ ఉ ఆర్.డి.ఓ. మాట్లాడుతూ పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి వార్డు పరిధిలో నిరంతర శుభ్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యానికి కీలక పాత్ర ఉందని, స్వచ్ఛమైన భీమవరం నిర్మాణానికి ప్రతి పౌరుడు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన సమితి అధ్యక్షులు కంతేటి వెంకట రాజు గారు, జ్ఞాన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రంగా సాయి గారు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు (చీ+హాం) మరియు సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజారోగ్య అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు మరియు ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం లో పాల్గొన్నారు. భీమవరం పట్టణాన్ని స్వచ్ఛమైన, అందమైన మరియు ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

బాలింత మృతి సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జి.గీతాబాయ్ వివరాలు వెల్లడి.

భీమవరం: (ఉషశ్రీ) మే 23 ఈ సంఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రైవేట్ ఆసుపత్రిపై ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు డిఎంహెచ్వో తెలిపారు.తనిఖీలో భాగంగా ఆసుపత్రి రికార్డులు, చికిత్స విధానం, విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది నుండి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో మృతి చెందిన బాలింత బీహార్ రాష్ట్రానికి చెందిన యువతిగా గుర్తించినట్లు తెలిపారు. గర్భిణీ స్త్రీ మే 9, 2026న హైదరాబాద్లో స్కానింగ్ చేయించుకున్నట్లు, అనంతరం రాజమండ్రిలోని ఒక హోటల్లో ఉన్నట్లు సమాచారం లభించినట్లు చెప్పారు. అక్కడి నుండి పూర్తిస్థాయి గర్భధారణ కాలం నిండకముందే ఒక ఆర్.ఎం.పి డాక్టర్ సహకారంతో మే 16, 2026 రాత్రి తణుకులోని స్టార్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు తెలిసిందన్నారు. ఆసుపత్రికి వచ్చిన గంట వ్యవధిలోనే శస్త్రచికిత్స నిర్వహించి శిశువును బయటికి తీసిన అనంతరం, మే 17, 2026 ఉదయం బాలింత మృతి చెందినట్లు వెల్లడించారు. తదుపరి బంధువులు లేదా కుటుంబ సభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల బృందంతో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహ అవశేషాలను భద్రపరిచినట్లు తెలిపారు. అలాగే నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. ప్రాథమిక విచారణలో వైద్య ఆరోగ్య శాఖ రికార్డుల ప్రకారం స్టార్ ఆసుపత్రి గత మూడు సంవత్సరాలుగా మూసివేయబడినట్లుగా నమోదై ఉన్నప్పటికీ, అనధికారికంగా కొంతమంది ఆర్.ఎం.పి డాక్టర్ల సహకారంతో కేసులు స్వీకరించి వైద్య సేవలు అందిస్తున్నట్లు సమాచారం లభించినట్లు చెప్పారు. అయితే దీనికి సంబంధించిన పూర్తి ఆధారాల సేకరణ కొనసాగుతోందని పేర్కొన్నారు. వైద్య నిబంధనలు మరియు ప్రభుత్వ మార్గదర్శకాలు ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించినందున స్టార్ ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జి. గీతాబాయ్ తెలిపారు.

గిద్దలూరు రూరల్ పరిధిలో పోలీస్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్.గిద్దలూరు, ఉషశ్రీ

మార్కాపురం: ప్రకాశం జిల్లా మరియు మార్కాపురం జిల్లా ఎస్.పి. హర్షవర్ధన్ ఆదేశాలమేరకు వేసవికాలంలో ప్రాపర్టీ నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు చెందిన నేర గ్యాంగులు సంచరిస్తున్నాయనే అనుమానంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించవలసిందిగా తెలియజేయడమైనది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, హోటల్స్, లాడ్జీలు, హై డౌట్ ప్లేసెస్, అలాగే ఊరి చివర డేరాలు/గుడారాలు వేసుకొని నివసిస్తున్న సంచార జాతులపై ఎంఎస్సీడీల ద్వారా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి, అనుమానితులను గుర్తించి పోలీస్ స్టేషన్కు తరలించి చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశించడమైనది. ఈ మేరకు గిద్దలూరు రూరల్ సి . ఐ.రామకోటయ్య రూరల్ సర్కిల్ పరిధిలోని అనుమానాస్పద ప్రదేశాలు, లాడ్జ్ లు, రిసార్ట్ లు, గ్రామ చివర ప్రాంతాలలో అనుమానితుల కదలికల గురించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించడమయినది.

సీఐ సురేష్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు.

గిద్దలూరు, ఉషశ్రీ. మార్కాపురం జిల్లా గిద్దలూరు మండలం పరిసర ప్రాంతాలలో గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లాలో చెడ్డి గ్యాంగ్ కదలికలు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు జిల్లా పోలీసులు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అందులో భాగంగా గిద్దలూరు రైల్వే స్టేషన్ తో పాటు, లాడ్జిలు, నిర్మానుష ప్రదేశాలు, నల్లబండ బజార్, ముండ్లపాడు పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఊరి బయట నివసిస్తున్న వ్యక్తులను పరిశీలించడమే కాకుండా అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాల సేకరించారు. ఎవరన్నా అనుమానిత అనుమానస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే 100,లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. అలానే వేసవి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇంటిలో విలువైన బంగారు ఇతర వస్తువులను నగదును ఉంచకుండా బంధువుల ఇళ్లల్లో కానీ బ్యాంకు లాకర్ లో కానీ భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహం లభ్యం

కాళ్ళ: (ఉషశ్రీ) మే 23 పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ మండలం కోపల్లిలోని ఆర్ వి ఆర్ ఫ్యాక్టరీ సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతి దేహం లభ్యమయింది. ఖాళీ స్థలం ఎదురుగా ఉన్న బోదెలో పడి ఉన్న సుమారు 45 సంవత్సరాలు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ విస్తృత పర్యటన

భీమవరం, మే 23 (ఉషశ్రీ): రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మరియు పశ్చిమ గోదావరి జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లాలో విస్తృత పర్యటన చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. జిల్లా సమాచార శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, మంత్రి గొట్టిపాటి రవికుమార్ 24వ తేదీ ఆదివారం సాయంత్రం 7 గంటలకు తాడేపల్లి నివాసం నుండి బయలుదేరి రాత్రి 9 గంటలకు తణుకు చేరుకుంటారు. అక్కడ ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో రాత్రి బస చేయనున్నారు. 25వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు తణుకు నుండి బయలుదేరి పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామానికి చేరుకొని సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం గరువు గ్రామంలో రహదారుల ప్రారంభోత్సవం నిర్వహిస్తారు. తదుపరి నౌడూరు సెంటర్ ప్రాంతంలో నౌడూరు నుండి బ్రహ్మణ చెరువు వరకు నిర్మించిన రహదారిని ప్రారంభించనున్నారు. మార్టేరు గ్రామంలోని అచంట రోడ్డులో ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టును కూడా మంత్రి ప్రారంభించనున్నారు. ఆ తర్వాత పెనుగొండలోని 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో నూతన 50 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తారు. వడలి గ్రామంలో సుబ్బారాయుడు పుంత వద్ద నిర్మించిన డబ్ల్యూబీఎం రహదారిని ప్రారంభించిన అనంతరం కొమ్ముచిక్కల గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నివాసంలో భోజన విరామం తీసుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 5 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారని జిల్లా సమాచార శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

మే 25న తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల

అమరావతి, (ఉషశ్రీ)మే 23: ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన "తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్" మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యిందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజిజ్ తెలిపారు. పరీక్షకు సంబంధించిన ప్రాథమిక ఆన్సర్ కీ ఇప్పటికే విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్సర్ కీని పరిశీలించుకోవచ్చన్నారు. పరీక్షను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి పారదర్శకతతో నిర్వహించామని, మూల్యాంకన ప్రక్రియను కూడా అదే స్థాయి నిష్పక్షపాత విధానం, భద్రతా ప్రమాణాలతో పూర్తి చేసినట్లు వెల్లడించారు. టాలెంట్ టెస్ట్ ఫలితాలను ఈ నెల 25న మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ ఎం డి . ఫరూక్ అధికారికంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఎంపిక పూర్తిగా మెరిట్ ఆధారంగానే జరుగుతుందని, ఫలితాల విడుదల అనంతరం ఎంపికైన విద్యార్థులకు తదుపరి ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేస్తామని షేక్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు.

నార్త్ జోన్ లో మే 26న బహిరంగ వేలం నిర్వహణ.

విశాఖపట్నం మే 23, ఉష శ్రీ మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ నార్త్ జోన్ పరిధిలోని కళ్యాణమండపములు, సామాజిక భవనములు, షాపులు (1 సంవత్సరము కాలమునకు) మరియు మార్కెట్స్ కు తేది. 01.04.2026 నుండి లేదా ఇచ్చిన తేదీ నుండి మూడు (3) సంవత్సరముల కాలమునకు గుత్తకు ఇచ్చుటకు గాను ఉన్నత అధికార్లు, జి.వి.యం.సి. వారి ఆదేశాలు మరియు 2026-27 గెజిట్ నోటిఫికేషన్ నెం. 18/2026 తేది 17.03.2026 మేరకు నార్త్ జోన్ జోనల్ కార్యాలయంలో తేది 26-05-2026 ఉ.గం. 11 లకు బహిరంగ వేలం నిర్వహించబడునని జోనల్ కమిషనర్ బి.రాము శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనేటప్పుడు వేలంపాటకు సంబంధించి ధరావత్తు సొమ్ము, రిజిస్ట్రేషన్ ఫీజు మరియు ఇతర నియమ నిబంధనల కొరకు గెజిట్ నోటిఫికేషన్ ప్రతి మరియు వేలం ఐటమ్స్, పూర్తి వేలం వివరములతో కూడిన వేలం నోటీసు ప్రతుల కొరకు రూ.300-00లు చెల్లించి నార్త్ జోన్ కార్యాలయము నుండి పొందవచ్చును. మరియు ఇతర వివరముల కొరకు మాధవధార నార్త్ జోనల్ కార్యాలయముల నందు గల బోనల్ కమిషనర్ / రెవిన్యూ అధికారులను కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చునని జోనల్ కమిషనరు తెలియజేశారు. బహిరంగ వేలం ఏదైనా అనివార్య కారణముల వలన వేలం ప్రక్రియ వాయిదా పడినచో లేదా మరుసటి పని దినమున లేదా నిర్ణయించబడిన తదుపరి తేదీన నిర్వహించబడునని ఆయన తెలిపారు.

హెల్మెట్లపై పోలీసుల అవగాహన ర్యాలీ

ఉష శ్రీ ప్రతినిధి వెంకట్ పోలవరం జిల్లా మారేడుమిల్లి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఐపీఎస్, డీఎస్పీ అష్రాఫ్ అలీ గార్ల ఆదేశాల మేరకు మారేడుమిల్లి సీఐ బి. నరసింహమూర్తి, ఎస్సై కే. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈరోజు మారేడుమిల్లి సెంటర్ నందు వాహనదారులతో హెల్మెట్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్ ధరించని వాహనదారులకు స్వచ్ఛందంగా వారిచే హెల్మెట్లు కొనుగోలు చేయించి ధరింపజేశారు. బైక్ నడిపే వ్యక్తితో పాటు వెనుక ప్రయాణించే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను అధికారులు వివరించారు. అంతేకాకుండా వాహనదారులు అందరూ తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి స్టేషన్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసు అధికారులు కోరారు.

విజయవాడలో ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026

38 ఎంఎస్ఎంఈ పార్కులకు సీఎం చంద్రబాబు వర్చువల్ శంకుస్థాపన

అమరావతి, (ఉషశ్రీ)మే 23: ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముందంజలో నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఈ నెల 25న విజయవాడలో నిర్వహించనున్న "ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026" రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త దిశగా నిలవనుంది. ఈ సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు కానున్న 38 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , ఎంఎస్ఎంఈల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ , పరిశ్రమల శాఖ మంత్రి ఎ. +. భరత్ తో పాటు పలువురు మంత్రులు, పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఎంఎస్ఎంఈ రంగ పారిశ్రామికవేత్తలు, పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు, విధానకర్తలు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు ఈ సమ్మిట్‌లో పాల్గొననున్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మొత్తం 175 పార్కుల లక్ష్యంలో భాగంగా మూడో విడతలో 38 పార్కులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే మొదటి రెండు దశల్లో 100 పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపనలు జరగగా, కొన్ని ప్రారంభమయ్యాయి. వీటిలో 761 యూనిట్లకు కేటాయింపులు జరిగి రూ.1,479 కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ఈ యూనిట్ల ద్వారా దాదాపు 24 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. సదస్సులో భాగంగా మేట , అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలతో కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో గ్రామీణ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించే "రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్" కేంద్రాలను సీఎం ప్రారంభించనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు నిధులను కూడా విడుదల చేయనున్నారు. యువత, మహిళలకు పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పించడం, స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించడం ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే దిశగా నిర్వహిస్తున్న "ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026" రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో మైలురాయిగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

శ్రీవారి అభిషేక వేళ సామాన్య భక్తులకు దివ్య దర్శన భాగ్యం

- తిరుమల చరిత్రలో శుక్రవారం రోజున రికార్డు స్థాయిలో భక్తులకు దర్శనం
- మే 22న శ్రీవారిని దర్శించుకున్న 87,689 మంది భక్తులు

తిరుమల, (ఉషశ్రీ) మే 23: భక్తుల సౌకర్యాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ టీటీడీ శుక్రవారం నిర్వహించే శ్రీవారి అభిషేక సేవ సందర్భంగా వేలాది మంది సామాన్య భక్తులకు శ్రీవారి దివ్య దర్శన భాగ్యాన్ని అందించింది. శుక్రవారం రోజున ఆలయంలో టీటీడీ సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్ల కారణంగా మొత్తం 87,689 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల చరిత్రలో శుక్రవారం రోజున ఇంత భారీ సంఖ్యలో భక్తులకు దర్శనం కల్పించడం ఇదే తొలిసారి కావడం విశేషం. సామాన్య భక్తునికి అభిషేక సేవ వీక్షణం -- జన్మ సాఫల్యం ప్రత్యేకించి శ్రీవారి అభిషేక సేవ కొనసాగుతున్న సమయంలోనే మే 22 న సుమారు 5850 మంది సామాన్య భక్తులకు టీటీడీ దర్శనం కల్పించింది. ప్రతి శుక్రవారం ఉదయం వివిధ ద్రవ్యాలతో చేసే ఎంతో ఉత్కృష్టమైన అభిషేక సేవను జీవితంలో ఒకసారైనా వీక్షించాలని శ్రీవారి భక్తులు కలలుకంటారు. ఆ కలను సాకారం చేస్తూ సామాన్య భక్తులకు అభిషేక సేవ సమయంలో టీటీడీ అత్యధిక సంఖ్యలో భక్తులకు దర్శనం కల్పించడంతో వారు ఆనందంతో పరవశించారు.

వివిధ విభాగాల సమన్వయం మరియు సమిష్టి కృషి : మరోవైపు భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ, క్యూలైన్ల నిర్వహణ, దర్శన సమయ సమన్వయం, అన్నప్రసాదాల పంపిణీ, తాగునీటి సదుపాయాలు తదితర అంశాల్లో టీటీడీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. శ్రీవారి కైంకర్యాలు కొనసాగుతున్నప్పటికీ సామాన్య భక్తులకు నిరంతర దర్శన సౌకర్యం కల్పించడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని అందించారు. కాగా వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలకు భారీగా తరలివస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. టీటీడీ అధికారులు, క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తుల కోసం విశేషంగా శ్రమిస్తున్నారు.

ప్రమాదం జరిగినప్పుడు కారులో డ్రైవర్ విక్రమ్ ఒక్కరే ఉన్నారు

- ఎదురుగా వచ్చిన వాహనం మీదకు రావడంతో ప్రమాదం
- డ్రైవర్ మొబైల్ కాలువలో పడిపోవడంతో సమాచారం అందించలేకపోయాడు
- వేంద్ర పంటకాలువలో పడిపోయిన కారుపై వివరణ
- డిఎస్పి రఘువీర్ విష్ణు

భీమవరం:(ఉషశ్రీ) మే 23 పాలకోడేరు మండలం వేంద్ర బ్రిడ్జి వద్ద వేంద్ర కాలువలోకి దూసుకు వెళ్లిన ఇన్నోవా కారు మానవ తప్పిదం వల్లనే జరిగిందని ఎదురుగా వాహనం మీదకు వస్తుందని భయపడిన కంగారుపడిన డ్రైవర్ విక్రమ్ కారును పక్కకి పోనివ్వడంతో వంటకాలువలోకి దూసుకు వెళ్లిపోయిందని భీమవరం డిఎస్పి రఘువీర్ విష్ణు తెలిపారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు పై దీనిపై విచారణ చేసామని ఇంకా విచారణ చేస్తామని భీమవరం పోలీస్ సబ్ డివిజనల్ ఆఫీసర్ రఘువీర్ విష్ణు తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో శనివారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలువలోనికి దూసుకు వెళ్లిన కారుపై ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని, కారును విక్రమ్ అనే డ్రైవర్ ప్రమాద సమయంలో నడుపుతున్నారన్నారు ప్రమాదం జరిగిన సమయంలో ఆయన ఒక్కడే కారులో ఉన్నాడన్నారు. అతని మొబైల్ ఫోన్ కాలువలో పడిపోవడంతో వెంటనే ప్రమాద సంఘటన ఇతరులకు పోలీసులకు తెలపలేక పోయాడన్నారు. కాలువలో పడిపోయిన కారును క్రేన్ సహాయంతో బయటకు తీసి ఒక ప్రైవేటు వాహనంలో విజయవాడ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కారు నడిపిన విక్రమ్ తో విజయవాడలో తమ పోలీస్ అధికారులు కలిసి మాట్లాడారన్నారు . ఈ సంఘటనలో వివరాలను లోతుగా అధ్యయనం చేసామని భీమవరం వచ్చిన అతను పుడ్ కోసం తాడేపల్లిగూడెం వెళ్ళాడన్నారు. గూగుల్ మ్యాప్ పెట్టుకుని వెళ్లిన అతను ప్రయాణం చేయవలసిన రూటులో గందరగోళమునకు గురయ్యాడు అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు కారులో ఎవరున్నారు ఆ వెహికల్ ఎవరిది అనేదానిపై తమ విచారణ చేయగా వికాస్ అనే వ్యక్తి ఈ కారును లీజుకి ఇస్తున్నాడు అన్నారు. అయితే ఈ కారు భీమవరం నకు చెందిన సతీష్ అనే హోంగార్డు కు చెందిన కారు అని తెలిపారు . సుమారు 7, 8 సంవత్సరాల క్రితం హోంగార్డ్ సతీష్ ఈ కారును లోనులో కొనుగోలు చేయడం జరిగిందన్నారు సమావేశంలో రూరల్ సీఐ శ్రీనివాసరావు భీమవరం వన్ టౌన్ సిఐ ఏ. రమేష్ , టూ టౌన్ సీఐ పీ. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో మట్టి ట్రాక్టర్లపై అధికారుల ప్రత్యేక దృష్టి

ఆకివీడు:(ఉషశ్రీ) మే 23 ఆకివీడు మండలంలో నిబంధనలు పాటించకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లపై రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల ఆకివీడు మండల పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా, భద్రతా నిబంధనలు పాటించకుండా మట్టి ట్రాక్టర్ల రాకపోకలు అధికమయ్యాయని స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం ఉదయం రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మట్టిని బారకాలు కప్పకుండా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మట్టి రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమతులు లేకుండా మట్టి తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులు వెంటనే తమ తీరు మార్చుకోవాలని, లేకపోతే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.

పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని సేవలను పరిశీలించిన ముఖ్యమంత్రి

- సంజీవని సహా వివిధ ప్రభుత్వ సేవలపై ప్రజల నుంచి నేరుగా ఫీడ్ బ్యాక్ తీసుకున్న సీఎం
- యాదమరి ఆరోగ్య కేంద్రం నుంచి నిపుణులు, వైద్యులతో వర్చువల్ గా మాట్లాడిన సీఎం
- అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి

పూతలపట్టు/చిత్తూరు జిల్లా, (ఉషశ్రీ)మే 23: చిత్తూరు జిల్లా యాదమరి మండలంలోని సంజీవని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సందర్శించారు. సంజీవని కార్యక్రమంలో పాల్గొనడానికి పూతలపట్టు వచ్చిన సీఎం చంద్రబాబు... తన పర్యటనలో భాగంగా పీహెచ్‌సీలో కొత్తగా ప్రవేశపెట్టిన సంజీవని డిజిటల్ వైద్య సేవల పనితీరును ల్యాబ్ డెమోల ద్వారా పరిశీలించారు. ఓ పెషంట్ పీహెచ్సీకి వచ్చి... వైద్యం చేయించుకుని మందులు తీసుకెళ్లే ప్రక్రియను మొత్తం ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ ప్రక్రియలో భాగంగా సంజీవని ద్వారా టెక్నాలజీని అనుసంధానించి ఎలాంటి వైద్యం అందిస్తున్నారోననే అంశాన్ని సీఎం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వివిధ విభాగాలను సందర్శించి.. అక్కడున్న సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా సంజీవని ద్వారా రోగులకు తాము ఎలాంటి సేవలను అందిస్తున్నామనే అంశాన్ని ముఖ్యమంత్రికి ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది వివరించారు.

ఓపీ నుంచి ఫార్మసీ వరకు ప్రతి విభాగాన్ని పరిశీలించిన సీఎం: ఓ పేషెంట్ పీహెచ్సీకి వస్తే పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ డెస్క్ వద్ద చేపట్టే నమోదు ప్రక్రియను ముఖ్యమంత్రి పరిశీలించారు. పీసీసీ డెస్క్ ప్రతినిధి ఈ డిజిటల్ విధానాన్ని సీఎంకు వివరించారు. డిజిటల్ క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్, విజిట్ రికార్డుల జనరేషన్, రోగుల సేవలను మ్యాపింగ్ చేసే విధానాన్ని సీఎంకు వివరించారు. పీహెచ్‌సీ డ్యాష్ బోర్డులో ఉన్న మొత్తం రిజిస్ట్రేషన్లు, రోజువారీ కన్సల్టేషన్లు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ట్రాకింగ్ వంటి వాటిని సీఎం పరిశీలించి... వాటి పర్యవేక్షణ తీరుపై అధికారులతో చర్చించారు. ఆ తర్వాత స్టాఫ్ నర్స్ స్టేషన్ ను సీఎం సందర్శించారు. బీపీ, ఎత్తు, బరువు, టెంపరేచర్, హార్ట్ బీట్, పల్స్ రేట్ వంటి వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తున్న ప్రక్రియను సీఎం పరిశీలించారు. ఆ తర్వాత సంజీవని ప్లాట్‌ఫామ్ లో ఏఐ అసిస్టెడ్ కన్సల్టేషన్ విధానాన్ని సీఎం చంద్రబాబు వీక్షించారు. అక్కడ ఉన్న మెడికల్ ఆఫీసర్ రోగి పాత చరిత్రను సేకరించడం, నర్సులు రికార్డు చేసిన వైటల్స్‌ను తనిఖీ చేయడం, ఏఐ సపోర్ట్, ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ జనరేషన్ వంటి ప్రక్రియలను లైవ్‌లో ముఖ్యమంత్రికి చూపించారు. ఈ ఏఐ టెక్నాలజీ వల్ల డాక్యుమెంటేషన్ భారం తగ్గి, రోగులపై ఎక్కువ శ్రద్ధ పెట్టేందుకు వీలవుతుందని చంద్రబాబుకు డాక్టర్ వివరించారు. ఆ తర్వాత ఫార్మసీ విభాగాన్ని సీఎం సందర్శించారు. ఫార్మసీలో డిజిటల్ ప్రిస్క్రిప్షన్లను చూసి మందుల పంపిణీ చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా ఫార్మసీ విధుల్లో భాగంగా తాము రోజు వారీ చేసే పని విధానాన్ని సీఎంకు ఫార్మసీ సిబ్బంది వివరించారు. ఇక పీహెచ్‌సీలోని వర్చువల్ రూమ్ నుంచి సంజీవని ప్లాట్‌ఫామ్ ద్వారా కనెక్ట్ అయి... కుప్పం ఏరియా హాస్పిటల్, బెంగళూరులోని టాటాఎండీకి నిపుణులైన వైద్యులతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ప్రాంత రోగులకు సుదూర ప్రయాణాల భారం తప్పిస్తూ, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా అత్యాధునిక వైద్య నిపుణుల సేవలను నేరుగా స్థానిక పీహెచ్‌సీలకే చేరవేస్తున్న విధానాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. అత్యాధునిక సాంకేతికత విధానం గ్రామీణ ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని ఈ సందర్భంగా సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో వైద్యం తీసుకుంటున్న పలువురు పేషంట్లు.. వారి బంధువులతో సీఎం సంభాషించారు. టెక్నాలజీని అనుసంధానించి అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్టు ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలతోపాటు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు ఎలా ఉందని వారి నుంచి సీఎం చంద్రబాబు ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. తమకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు తమకు అందుతున్నాయని.. పథకాల అమలు బాగుందని వారు సీఎంకు వివరించారు. అలాగే స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించగలుగుతున్నామని లబ్దిదారులు సీఎంకు చెప్పారు.

గ్రామీణ రహదారులు.. అభివృద్ధికి జీవనాడులు

- రూ.1.19 కోట్లతో డబ్ల్యూబీఎం మెటల్ రహదారి ప్రారంభం
- లింగాల గ్రామంలో ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ
- రైతులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి : కలెక్టర్
- గ్రామీణ అభివృద్ధికి రహదారులే బలమైన పునాది

విజయవాడ, (ఉషశ్రీ) మే 23: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని, ఒక గ్రామానికి మంచి రహదారి ఉంటే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, సామాజిక రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందని జి . లక్ష్మీశ అన్నారు. శనివారం ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాలలో రూ.1.19 కోట్ల వ్యయంతో నిర్మించిన డబ్ల్యూబీఎం మెటల్ రహదారిని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ , కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ , జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), ప్రాంతీయ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగాల నుంచి వత్సవాయి వెళ్లేందుకు డొంకల మార్గాలను అభివృద్ధి చేసి ఏర్పాటు చేసిన ఈ రహదారి గ్రామీణ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యవసాయ పనులతో పాటు పంట ఉత్పత్తులను మార్కెట్లకు తక్కువ సమయంలో, తక్కువ రవాణా ఖర్చుతో తరలించేందుకు ఈ రహదారి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ రహదారులు కేవలం ప్రయాణ మార్గాలు మాత్రమే కాకుండా గ్రామాభివృద్ధికి, ప్రజల జీవనోపాధి మెరుగుదలకు, సామాజిక మార్పుకు బలమైన పునాదిగా నిలుస్తాయని కలెక్టర్ వివరించారు. రహదారుల అభివృద్ధితో గ్రామాల్లో వ్యాపార, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు విద్య, వైద్య సేవలు కూడా ప్రజలకు మరింత చేరువవుతాయని చెప్పారు. ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన రహదారులు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ. రాము, నందిగామ ఆర్‌డీవో అనిల్ కుమార్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బడి వైపు అడుగు.. ప్రగతి వైపు పరుగు..

- జిల్లాలో ఉత్సాహంగా కొనసాగుతున్న "బడి పిలుస్తోంది" కార్యక్రమం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విలువల విద్య : కలెక్టర్ లక్ష్మీశ
- ప్రైవేటు పాఠశాలల నుంచి 26 మంది చిన్నారుల చేరిక
- డ్రాప్‌అవుట్ పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలి

ఎన్‌టీఆర్ జిల్లా,(ఉషశ్రీ)మే 23: జిల్లాలో "బడి పిలుస్తోంది" కార్యక్రమం ఉత్సాహవంతంగా కొనసాగుతోందని, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేస్తున్నారని జి . లక్ష్మీశ తెలిపారు. శనివారం కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, డీఈవో ఎల్. చంద్రకళ, సమన్వయ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి వత్సవాయి మండలంలోని భీమవరం, మక్కపేట గ్రామాల్లో పర్యటించారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో పాల్గొన్నారు. భీమవరం గ్రామంలో ఇంటింటి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన 26 మంది చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మక్కపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రవేశాల పరిస్థితిని పరిశీలించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించే చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చిన్నారి పాఠశాలలో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు వంటి సౌకర్యాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుతోనే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని, ప్రతి బాలబాలిక తప్పనిసరిగా బడిలో చేరేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డ్రాప్‌అవుట్ పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించే దిశగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు."మన బడి – మన భవిష్యత్తు" కార్యక్రమం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిభిరంలో 157 మందికి కంటి పరీక్షలు

భీమునిపట్నం, ఉష శ్రీ: భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, సన్ స్కూల్ మరియు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నం వారిచే స్థానిక సన్ స్కూల్ నందు శనివారం నాడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో సుమారు 157 మంది కంటి పరీక్షలు చేయించుకొనగా వీరిలో 37 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగినది. అదేవిధంగా కళ్ళజోడు అవసరం అయిన 24 మంది పేద వృద్ధులకు త్వరలో ఉచిత కళ్ళజోడు ఇవ్వడం జరుగుతుందని భీమిలి నీడి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కైతపల్లి శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సిబ్బందితో పాటు డాక్టర్ రమీజ్ క్యాంప్ కో ఆర్డినేటర్ పైడిరాజు, బిఎన్ డబ్ల్యూ సభ్యులు ముసునూరి సూర్య శ్రీనివాస్, బసవ కృష్ణమూర్తి, వెంపాడ శ్రీనివాసరెడ్డి, వాంద్రాసి సతీష్, కైతపల్లి భరద్వాజ్, కైతపల్లి లీలా రాజు, శివ దళాయి, పి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు. లక్ష్మీ లావణ్య సౌజన్యం లో బ్లిస్ క్యాటరింగ్ వారు మరియు సన్ స్కూల్ ఉపాధ్యాయులు తమ పూర్తి సహాయ సహకారాలు అందించారు.

భైరవవాక క్లీన్ స్వీప్ లో పాల్గొన్న గంటా, నాగబాబు

భీమునిపట్నం, ఉష శ్రీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే దిశగా ప్రజలను చైతన్యం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సింహాచలం సమీపంలోని భైరవవాక ఆలయ పరిసరాల్లో క్లీన్ స్వీప్ స్వచ్ఛత కార్యక్రమంలో ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు తో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ఎంత ప్రమాదకరమో పాఠశాల దశ నుంచే విద్యార్థులందరికీ తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వెయిటేజీ మార్కులిస్తే మరింత చైతన్యం తీసుకురావడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. క్లీన్ స్వీప్ ను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి రోజు వేలాది మంది భక్తులు భైరవవాక ఆలయ దర్శనానికి వస్తున్న నేపథ్యంలో వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందని నాగబాబు పేర్కొన్నారు. అటవీ శాఖ నిబంధనల కారణంగా ఆలయ పరిసరాల్లో ఎలాంటి పనులు చేసే అవకాశం లేదని గంటా తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నాగబాబు చెప్పారు. ప్లాస్టిక్ సంచుల స్థానంలో గుడ్డ సంచులు వాడాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చీపుర్లతో ఆలయ పరిసరాల్లో ఉన్న చెత్తను గంటా, నాగబాబులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, పంచకర్ల సందీప్, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, శాఖారి శ్రీనివాస్, పంచదార్ల శ్రీనివాస్, చెట్టుపల్లి గోపీ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కసిరెడ్డి దామోదరరావు, కృష్ణయ్య, లొడగల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని భారీగా దర్శించుకున్న భక్తులు

ఉష శ్రీ వరుకుంటపాడు ఉదయగిరి ప్రతినిధి బాలు ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు వద్ద వెలసి ఉన్న శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు పామూరు, వరికుంటపాడు మండలాల నుంచి భక్తులు భారీగా స్వామివారిని దర్శించుకోవడం జరిగింది.ప్రత్యేకంగా మహిళ భక్తులు వందలాది మంది స్వామి సేవలో తరించారు వేలాదిమంది భక్తులు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నప్రసాద సౌకర్యం కల్పించారు.ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకుంటే తిరుమల శ్రీనివాసుని దర్శించుకున్న అనుభూతి కలుగుతుందని అన్నారు.

మోపాడు చెరువులో ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్‌పనులు ప్రారంభించిన చుంచు కొండయ్య

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ ఒంగోలు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో పామూరు మండలంలోని మోపాడు రిజర్వాయర్ జంగిల్ క్లియరెన్స్ పనులు మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోపాడు చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలను, పూడికతీత మరియు కలుపు తొలగింపు చర్యల ద్వారా చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్య తెలిపారు

పేదల సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మల్లికార్జునుడు

ఉష శ్రీ ఆర్ సి ఇంచార్జి కనిగిరి యాటా రాఘవేంద్ర. రమణమ్మ మెమోరియల్ మల్లికార్జున్ రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి మల్లికార్జున్ రెడ్డి, యువ సముద్రం ఫౌండేషన్, నెక్స్ జెన్ రోబోటిక్స్ వారి ఆధ్వర్యంలో పామూరు పట్టణంలో ప్రతి శనివారం భారీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఆ క్రమంలో భాగంగా శనివారం కందుకూరు రోడ్డు నందు పోలీస్ స్టేషన్ సమీపంలో భారీ అన్నదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది పేదలు, కొందరు పట్టణ ప్రజలు పాల్గొని అన్నదానం స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఆకలి బాధ తీర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు ఆయన తెలిపారు

తుపాకుల లక్ష్మీదేవి భౌతిక కాయానికి దద్దాల, గంగసాని,నివాళి

ఉష శ్రీ :ఆర్ సి ఇంచార్జి కనిగిరి యాటా రాఘవేంద్ర. వైఎస్సార్సీపీ పామూరు పట్టణ యువజన విభాగం అధ్యక్షులు తుపాకుల ఆంజనేయుల రెడ్డి సతీమణి తుపాకుల లక్ష్మీదేవి గుండెపోటు కారణంగా ఆకస్మికంగా మరణించారు.విషయం తెలుసుకున్న లివైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం ఉదయం మండల పార్టీ శ్రేణులతో కలిసి లక్ష్మీదేవి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో గంగసాని హుస్సేన్ రెడ్డి,కల్లూరి రామిరెడ్డి, యాటా రాఘవేంద్ర ,అంబటి కొండారెడ్డి,షేక్ నాయబ్ రసూల్,జొన్నలగడ్డ గోవిందయ్య,ఇర్రి కృష్ణారెడ్డి,షేక్ గయాజ్, శ్రీరామ శ్రీనివాసులు, రేగలగడ్డ నాగరాజు,ఉడుముల మధుసూదన్ రెడ్డి,షేక్ బారా షరీఫ్,షేక్ రసూల్,గాజులపల్లి శ్రీనివాసులరెడ్డి, పుట్లూరి యోగిరెడ్డి, షేక్ రసూల్,ఉడుముల నారాయణ రెడ్డి, డాక్టర్ సిద్దవటం వెంకటరెడ్డి,ఇర్రి వెంకటేశ్వర్లు రెడ్డి,పోలేపల్లి సిద్దయ్య, మానం ప్రసాద్,బూసరాజు హరీష్,రాచకొండ మధు తదితరులు పాల్గొన్నారు..

ఘనంగా టిడిపి జెండా ఆవిష్కరణ.. ఇళ్లపై రెపరెపలాడుతున్న పసుపు పతాకాలు

ఉష శ్రీ పామూరు ప్రతినిధి ముఖ్యమంత్రివర్యులు, జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ కార్యా నిర్వాహ అధ్యక్షుడు నారా లోకేష్ బాబు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పిలుపు మేరకు పామూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ పసుపు జెండాను స్వచ్ఛందంగా ఎగరవేసి తమ అభిమానాన్ని చాటుకున్న తెలుగుదేశం పార్టీ మండల మహిళా ప్రధాన కార్యదర్శి రజియా సయ్యద్ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు చంద్రబాబు నాయుడు,నారా లోకేష్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీ జెండాను ఎగుర వేసినట్లు తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తామని ఆమెస్పష్టం చేశారు.

బద్వేల్ పట్టణంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ నిర్వహించిన

ఉష శ్రీ బద్వేల్/ పోరుమామిళ్ల ప్రతినిధి రామలక్షమయ్య రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ జి. రమణయ్య, వార్డ్ శానిటేషన్ ఉ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో గుర్తించిన "ఎల్లో స్పాట్"ను ప్రత్యేకంగా శుభ్రపరిచారు. అలాగే వెంగమాంబ నగర్ మసీదు వీధిలో క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, పరిశుభ్రత పాటిస్తూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.

మా జగనన్నే గంగపుత్రులకి దేవర

- వైసిపి హయాంలో మత్యకారుల క్షకోసం ఎంతో చేశారు..
- చంద్రబాబు వాటన్నిటిని నాశనం చేసే పనిలో ఉన్నారు..
- 'మత్స్యకార భరోసా" పథకం ఎంతమందికి నగదు ఇచ్చారు?
- శ్వేత పత్రం విడుదల చేయాలి
- తెప్ప బోట్లు, వలలతో వినూత్న రీతిలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి నిరసన

విశాఖపట్నం, మే 23, ఉష శ్రీ. ఇప్పటి వరకు ఎంత మంది తమ గంగపుత్రులకు "మత్స్యకార భరోసా" పథకం ద్వారా నగదు ఇచ్చారో రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. అర్హులైన మత్స్యకార కుటుంబాలు అందరికీ మత్స్యకార సేవలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 31 వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్ అధ్యక్షతన, వైసిపి నియోజకవర్గ పరిశీలకులు వీసం రామకృష్ణ సమక్షంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ దక్షిణ వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రెండు తెప్ప బోట్లు, వలలతో వినూత్న రీతిలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దక్షిణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్ మాట్లాడుతూ జగనన్నే మా గంగపుత్రులకి దేవర అని అన్నారు. రాష్ట్రంలో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ లాండింగ్ సెంటర్స్ నిర్మించిన ఘనత జగన్మోహన్ రెడ్డిది అని చెప్పారు. ఒక్కో ఫిషింగ్ హార్బర్ కి 500 కోట్లు చొప్పున కేటాయించారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని పోర్టులను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. మత్స్యకారులను గత 40 సంవత్సరాలుగా చంద్రబాబునాయుడు మోసం చేశారని, ఇప్పుడు లోకేష్ కూడా మోసం చేస్తున్నారన్నారు. మత్స్యకారుల తండ్రి కొడుకులు మత్స్యకారులను మోసం చేశారని మండిపడ్డారు. గత ఏడాది పూర్తిగా ఇవ్వకుండా, రెండోవ ఏడాది మత్స్యకార భరోసా పథకం 30% ఎగ్గొట్టి , ఈ ఏడాది టెక్నికల్ పేరుతో పూర్తిగా 50 శాతం పైగా చంద్రబాబు తమ మత్స్యకారులను అనర్హులుగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మత్స్యకారులను రెండు నెలలుగా వేటకు వెళ్ళకుండా ఉన్నందుకు జీవన భృతికి హక్కుగా ఇస్తున్న 20వేలును కూడా చంద్రబాబు చిన్న చూపు చూడడం సరికాదన్నారు. తమ గంగపుత్రుల కుల దేవతలు శాపం తగులుతాదని వాసుపల్లి హెచ్చరించారు. ప్రతి ఎజెండాలో మత్స్యకారులకు ఐదు కిలోమీటర్లు జెట్టి, ఫిషింగ్ హార్బర్లు నిర్మాణం, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని చంద్రబాబు ప్రగల్భాలు పలికాడని తెలిపారు. మత్స్యకారులను నా ఎదురుగానే చంద్రబాబు తాటతీస్తాను, తోలు తీస్తానని అన్నాడని ఆరోపించారు. చంద్రబాబు మత్స్యకారులకు ఇచ్చే గౌరవం ఇదేనా అన్నారు. చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనలో 3లక్షల కోట్ల అప్పు తెచ్చాడని తెలిపారు. కేవలం 47వేల కోట్లు అమరావతి పెట్టినట్టు వెల్లడించారు. చంద్రబాబు పాలనలో ఒక్క ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల మత్స్యకారులు ఉంటే కేవలం 1లక్ష 30వేల మందికి మత్స్యకార సేవలో ఇచ్చి చంద్రబాబు నాయుడు భుజాలు ఎగురవేస్తున్నారని ఎద్దేవా చేశారు. దీంతో మిగిలిన మత్స్యకారులు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ పథకాల్లో బినామీ పేర్లతో పేదల డబ్బు దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకాన్ని అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే మత్స్యకార సేవలో నిధులు విడుదల చేసి మత్స్యకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో త్వరలో జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తాని హెచ్చరించారు. నిరసనలో చేపల సుంకాను పట్టుకుని చోడిపిల్లి శివ, చేపల నూకరాజు (బుడ్డి) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, మాజీ కార్పొరేటర్ కోడిగుడ్లల శ్రీధర్,తోట పద్మావతి,బిపిన్ జైన్,వార్డ్ ప్రెసిడెంట్ ,పీతల వాసు, దశమంతులు మాణిక్యాలరావు , పిన్నింట్ల రాజారెడ్డి, ముత్తాబత్తుల రమేష్, మహమ్మద్ షకిల్, గురజారపు రవి, ముజీబ్ ఖాన్,భీశెట్టి ప్రసాద్, స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ లింగం శ్రీను,మాజీ కో ఆప్షన్ నెంబర్ షరీఫ్ , మాజీ కార్పొరేటర్ పత్తిరపల్లి రాము,జిల్లా జనరల్ సెక్రెటరీ గనగల రామరాజు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజు,జిల్లా సెక్రటరీ అభిరెడ్డి ఆది విష్ణు రెడ్డి , పద్మనాభం అమ్మాజీ, స్టేట్ బీసీ నాయకులు లండ రమణ, స్టేట్ నాయకులు పరవాడ ఈశ్వర్, దస్మంతుల చిన్ని, వేలంగిని రావు, భానుమూర్తి, బోరా విజయలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, సాగర్, ఈతలపాక విజయ్ భాస్కర్,జిల్లా ప్రెసిడెంట్ వడ్డాది దిలీప్, జిల్లా అనుబంధ సంఘాల వైస్ ప్రెసిడెంట్లు కోన శంకర్,దూడ అప్పారావు,గుంటు ఆనంద్,సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు బోనుగు రాజా పాత్రుడు,తాడి రవితేజ,జీరు సుధా,ఆకుల శ్యామ్,సువార్త రాజు,సూరపతి అప్పన్న, బొండాడ వెంకట్రావు,బేవార మహేష్,పిల్లా అప్పారావు, మహమ్మద్ యాసిన్ (బాబ్జి),మళ్ళా విజయ్,వాసుపల్లి బంగారమ్మ,కడవల నాగమణి, సూర్య, గరికిన చంద్రశేఖర్,ఉ కృష్ణ కుమార్,జిల్లా నాయాకులు నీలపు లక్ష్మి , పెద్దగాడా బాబ్జి, పెదబాబు,జిల్లా అనుబంధ సంఘాల, సౌత్ అనుబంధ సంఘాల,వార్డ్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

రక్తపోటు పరీక్షలు చేయించుకోండి

విశాఖపట్నం .మే 23 ,ఉష శ్రీ ప్రపంచ రక్తపోటు దినోత్సవం 2025 సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించారని తెలియచేశారు. 'వరల్డ్ హైపర్‌టెన్షన్ డే'. అధిక రక్తపోటుపై అందరికీ అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది మే 17న ప్రపంచ హైపర్‌టెన్షన్ డేను నిర్వహిస్తున్నారని, రక్తపోటు సాదారణ స్థాయి కంటే పెరగడాన్నే హైపర్ టెన్షన్ అంటారు ఇది 'సైలెంట్ కిల్లర్' వ్యాధి . టెన్షన్, హైపర్ .. గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ సమస్యలు, చూపు కోల్పోవడం, మానసిక సమస్యలకు దారితీస్తుంది. అధిక రక్తపోటు అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం ఈ నేపథ్యంలో హైబీపీని నియంత్రణలో ఉంచుకోవడానికి రోజు మందులు వాడుతూనే.. మనం తీసుకునే ఆహారంలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుక ్రరాలు మన రక్తపోటును తగ్గించడానికి సహాయపడతాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మనిషి మనుగడకు హృదయ స్పంద లా కొట్టుకుంటున్న సమయంలో.. ఓ దశలో గుండె ముడుచుకు పోయినప్పుడు రక్తం ఒక్క ఉదుటున ముందుకు దూకుతుంది సమయంలో సహజంగానే రక్తపోటు అధికశేగా ఉంటుంది దీనినే 'సిస్టాలిక్ ప్రెషర్' అంటారు.ఈ పోటు విలువ 100 నుంచి 140ఎఎ ఎస్ర (మిల్లీమీటర్ ఆఫ్ మెర్క్యురీ) మధ్యలో ఉంటే దాన్ని సాధారణ రక్తపోటుగా పరిగణిస్తారు. గుండె వ్యాకోచించినప్పుడు లేదా వికసించుకున్నప్పుడు రక్తప్రవాహ పీడనం తక్కువగా ఉంటుంది. దీన్నే 'డయస్టాలిక్ ప్రెషర్' అంటారు ఇందులో పీడనం 60-90లోపు ఉంటే సాధారణ స్థాయిగా భావిస్తారు గతంలోఆరోగ్యవంతుల రక్తపోటును 120/80 గా పరిగణించేవారు మారుతున్న పరిస్థితుల ఆధారంగా 140/90ని సాధారణ రక్తపోటుగా నిర్ధారించారు . ఇంతకంటే ఎక్కువగా ఉంటే హైపర్ టెన్షన్‌తోబాధపదాటున్నట్లు లెక్క. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు మరియు సంబంధిత వైద్యాధికారులు క్రింది శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక ఎన్‌సీడీ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించారు.

లోకేష్ జూమ్ కాల్ ద్వారా సమావేశమైన బొల్లా, అడుసుమల్లి, గుంటుపల్లి, ఫిరోజ్

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు ను ఈసారి క్లస్టర్ల స్థాయిలో ఒక పండగ వాతావరణం లో, కలసికట్టుగా విజయవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. హైబ్రిడ్ విధానంలో ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు సన్నహాకాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ ఇన్చార్జిలతో ఆయన ఆన్లైన్ ద్వారా సమావేశమై దిశ నిర్దేశం చేశారు. ఈసారి మహానాడు ను ' స్త్రీ శక్తి మహానాడు' అనే థీమ్ తో నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో అత్యంత ఘనంగా మూడు రోజులపాటు నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునకు స్పందించి ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడు రెండు రోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు లోకేష్ వివరించారు. దీని ప్రకారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో పోలిట్ బ్యూరో, జాతీయ రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 1875 క్లస్టర్ కేంద్రాలలో వర్చువల్ గా మహానాడు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి క్లస్టర్ కేంద్రంలో ఎల్ఈడి టీవీ, స్పీకర్లు వంటి సాంకేతిక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మహానాడు క్లస్టర్ వ్యవస్థను క్షేత్రస్థాయిలోపేతం చేయడానికి ఒక మంచి అవకాశం గా ఉపయోగించుకోవాలని లోకేష్ అన్నారు. " క్లస్టర్ ఇంచార్జ్ లకు ఎక్కువ బాధ్యత ఇవ్వాలన్నది పార్టీ జాతీయ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశం. ఈ వ్యవస్థ ద్వారానే మనం ముందుకు వెళ్లాలి " అని ఆయన పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలోని కుటుంబ సాధికార సారధి (కె ఎస్ ఎస్) నుంచి బూత్ ఇంచార్జిలు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల సభ్యుల వరకు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. హాజరును 'మై టిడిపి ' యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో, త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని లోకేష్ గుర్తు చేశారు. ఇందుకు మహానాడు ను ఒక వేదికగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీలో వ్యక్తులు శాశ్వతం కాదని, వ్యవస్తే శాశ్వతమని, ఆ వ్యవస్థను పటిష్టం చేసేందుకే క్లస్టర్ ఇన్చార్జిలకు అవకాశం కల్పించామని అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి నామినేట్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని వారి పనితీరు 'మై టిడిపి' యాప్ ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్చార్జిలతో సమన్వయం చేసుకుంటూ, ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి మహానాడు చారిత్రాత్మక విజయం నింపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పామూరు మండల టిడిపి అధ్యక్షులు బొల్లా నరసింహారావు, కనిగిరి పట్టణ అధ్యక్షులు ఫిరోజ్, కనిగిరి నియోజకవర్గ క్లస్టర్ 11వ ఇంచార్జ్ అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, కనిగిరి నియోజకవర్గ క్లస్టర్ 10వ ఇంచార్జ్ గుంటుపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

"ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించిన కమిషనర్ కుమారి హెచ్ ఎస్. భావన ఐఏఎస్

ఉష శ్రీ కడప ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రతలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం శనివారం కడప నగరపాలక సంస్థ పరిధిలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కడప నగరపాలక సంస్థ పరిధిలోని మాసాపేట 26వ డివిజన్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కడప నగరపాలక సంస్థ కమిషనర్ కుమారి హెచ్ ఎస్. భావన ఐఏఎస్ హాజరై పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ కుమారి హెచ్ ఎస్ భావన ఐఏఎస్ గారు మాట్లాడుతూ పరిశుభ్రమైన నగరం ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు మరియు నగర అభివృద్ధికి ఎంతో కీలకమని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని, తడి మరియు పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలువలు, చెత్త సేకరణ కేంద్రాలు, ఖాళీ స్థలాలు మరియు ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మురుగు కాలువల శుభ్రపరిచే పనులు, చెత్త తొలగింపు, మలిన ప్రాంతాలలో బ్లీచింగ్ మరియు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడిషనల్ కమిషనర్ శ్రీ రాకేష్ చంద్ర గారు కార్యక్రమంలో పాల్గొని పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుభ్రత కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచనలు అందించారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రజా ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంటూ వారి సేవలను అభినందించారు. "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ద్వారా నగరంలో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడంతో పాటు కడప నగరాన్ని స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన మరియు సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కడప నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ విభాగాధిపతులు మరియు కార్యదర్శులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు మండల పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టిన ఎస్సై రాజకుమార్

ఉష శ్రీ కనిగిరి హనుమంతుని పాడు బాలు మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గం హనుమంతుని పాడు మండలం మరియు పరిసర ప్రాంతాలలో హనుమంతుని పాడు సబ్ ఇన్స్పెక్టర్ రాజకుమార్ తన సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలో చెడ్డి గ్యాంగ్ కదలికలు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం జరిగింది. అందులో భాగంగా పట్టణంలోని నిర్మానుష ప్రదేశాలు, తదితర ప్రాంతాలను వారు తనిఖీ చేశారు. ఊరి బయట నివసిస్తున్న వ్యక్తులను పరిశీలించడమే కాకుండా, అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు, అనుమానిత వాహనాలు గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏ సమయంలోనైనా ఎటువంటి ఆపదైనా తన నంబర్ కు ఫోన్ చేయాలని తెలిపారు. వేసవి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇంటిలో విలువైన బంగారు ఇతరత్రా వస్తువులను నగదును బంధువుల ఇళ్లలో కానీ బ్యాంకు లాకర్లో కానీ భద్రపరుచుకోవాలని సూచించారు. 24 గంటలు హనుమంతుని పాడు పోలీసులు మండల ప్రజల రక్షణకై అప్రమత్తంగా ఉంటారు మండల ప్రజలు ఎలాంటి ఆపదైనా ఏ సమయంలోనైనా తమకు తెలియపరచాలని 24 గంటలు హనుమంతునిపాడు పోలీసులు అప్రమత్తంగా ఉంటారని, వెంటనే స్పందిస్తారని ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. అపరిచిత వ్యక్తుల కదలికలు, అనుమానాస్పాద వాహనాలు సంచరిస్తుంటే తన మొబైల్ నంబర్ కు 9121102211 తెలియపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు

సెంట్రింగ్ కార్మికుల డిమాండ్ల సాధన కై సమ్మె ఉధృతి

ఉష శ్రీ శేరిలింగంపల్లి షాడో తెలంగాణ ప్రతినిధి : శేరిలింగంపల్లి నియోజక వర్గం కొండాపూర్ సెంట్రింగ్ యూనియన్ ఆధ్వర్యంలో చైర్మన్ విశ్వనాథ్ యాదవ్, ప్రెసిడెంట్ రాము యాదవ్, జనరల్ సెక్రటరీ సామ ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో సెంట్రింగ్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. సెంట్రింగ్ రేటును రూ.51 పెంచాలని, కార్మికులకు ఈఎస్ఐ కార్డుల సౌకర్యం కల్పించాలని , ప్రతి నిర్మాణ స్థలంలో సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. మే 16 నుంచి ప్రారంభమైన ఈ సమ్మె 8వ రోజుకు చేరుకోగా, శనివారం (23-05-2026) కొండాపూర్ యూనియన్ తరఫున సుమారు 200 మంది కాంట్రాక్టర్లు టూ-వీలర్ ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టి, అనంతరం ఇందిరా పార్క్ వద్ద కి చేరి దర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రటరీ సామ ఎల్లారెడ్డి మాట్లాడుతూ, "మా న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు. అలాగే, సమ్మెను మరో వారం రోజుల పాటు కొనసాగించాలని ఈ రోజు సమావేశంలో తీర్మానించినట్లు నాయకులు తెలిపారు.

దేవరాజుసూరయపల్లి హైవే సెంటర్లో లైట్లు ఏర్పాటు.

ఉష శ్రీ ప్రతినిధి సీతారామపురం మండలం (మే 23) మండలంలోని దేవరాజుసూరయపల్లి హైవే రోడ్డు సెంటర్ లో ప్రమాదాల నియంత్రణకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు శనివారం సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటులను ఉదయగిరి సీఐ వెంకట్రావు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో సెంటర్లో లైట్లు ఏర్పాటు చేయటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.... హైవేలపై రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఈ లైట్లు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వెంకట రాజేష్, హైవే మెయింటెన్స్ సిబ్బంది ప్రభాకర్ , స్థానిక కూటమి నేత ముత్తూరు వెంకటేశ్వర్లు ఉన్నారు.

కనిగిరిలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి డోల... ఉగ్ర

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ : కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి తో కలిసి 'క్లీన్ స్వీప్ ' కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి స్వామి ఆర్టీసీ డిపో పరిసరాలను ఎమ్మెల్యే ముక్కు నరసింహారెడ్డి తో కలిసి చీపురు పట్టి శుభ్రం చేసిన మంత్రి స్వామి కనిగిరి మంచినీటి దొరువు ఆధునీకీకరణ పనులను ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించిన మంత్రి స్వామి

కొండయపాలెం పంచాయతీలో వీధి దీపాలు ఏర్పాటు

ఉష శ్రీ ఉదయగిరి రూరల్ మే 23 ఉదయగిరి మండలం కొండాయపాలెం గ్రామ పంచాయతీలో శనివారం వీధి దీపాలు తెలుగుదేశం పార్టీ మాజీ కార్యదర్శి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొండయపాలెం పంచాయతీ గానుగపెంటపల్లి గ్రామంలో శ్రీరాములవారి తిరునాల సందర్భంగా గ్రామంలో వీధి దీపాలు లేక తీవ్రాయిబ్బందులు పడుతున్నాం అని గ్రామస్తులు తెలియజేయడంతో వెంటనే స్పందించి స్థానిక నాయకులకు ఉదయగిరి తెలుగుయువత ఉపాధ్యక్షుడు గానుగపెంట నారాయణరెడ్డి, కొండయపాలెం తెలుగుదేశం పార్టీ కార్యదర్శి జి నాగేంద్ర రెడ్డి మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకులు బి శ్రీహరి,పంచాయతీ బిసి యూత్ నాయకులు జి దినేష్,బూత్ అధ్యక్షుడు గంగాధర్,పంచాయతీ ఎస్సీ సెల్ నాయకులు స్వర్ణ నాగరాజు ఆధ్వర్యం లో వీధి దీపాలు వేయించటం జరిగింది. మన్నేటి వెంకట్ రెడ్డి కి గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

పలు సచివాలయాలకు సబ్సిడీపై పచ్చి రొట్టె విత్తనాలు వచ్చి ఉన్నవి

ఉష శ్రీ ఉదయగిరి ప్రతినిధి బాలు ఉదయగిరి మండల పరిధిలోని పలు సచివాలయాలలో బండగానిపల్లి మరియు శకునాలపల్లి మరియు అప్ప సముద్రం రైతు సేవ కేంద్రాలకు 50 శాతం సబ్సిడీతో పచ్చి రొట్టె విత్తనాలు వచ్చినవి ఆయా రైతు సేవ కేంద్రాల పరిధిలోని గ్రామ రైతులు విత్తనాలు కావలసిన వాళ్లు రైతులు తమ పొలం పాసుపుస్తకాలు తీసుకుని రావాల్సిందిగా కోరడమైనది జిలుగులు పూర్తి ధర 160 రూపాయలు సబ్సిడీ 50% రైతు కట్టవలసి ఉంటుంది నికర ధర కేజీకి 80 రూపాయలు కట్టవలసి ఉంటుంది జనుములు పూర్తి ధర 154 రూపాయలు 50% సబ్సిడీ పోను రైతు కట్ట వలసింది 77 రూపాయలు మాత్రమే కట్టవలెను పిల్లి పెసర పూర్తిగా కేజీకి 196 రూపాయలు 50% సబ్సిడీ పోను రైతు కట్టవలసింది 98 రూపాయలు మాత్రమే ఈరోజు ఈ అవకాశాన్ని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని ఏడిఏ చెన్నారెడ్డి కోరుతున్నారు.

పోలేరమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలి - దద్దాల నారాయణ యాదవ్

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ వెలిగండ్ల మండలం, హుస్సేన్ పురం పంచాయతీ తమ్మనేనిపల్లి గ్రామంలో శ్రీ పోలేరమ్మ తల్లి అమ్మ వారి తిరునాళ్ల మహోత్సవం లో వైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణ చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు ఆయనకు అందజేశారు. తదుపరి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి శేషవస్త్రంతో ఆయనను ఘనంగా సత్కరించారు. శ్రీ పోలేరమ్మ తల్లి దివ్య అనుగ్రహంతో ప్రజలందరూ సకల ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, మరియు సుఖశాంతులతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో తమ్మనేని శివరామిరెడ్డి,ఆవుల తిరుపతిరెడ్డి,ఎలికా నారాయణ కసిరెడ్డి శ్రీనివాసులు, తమ్మనేని గోవిందరెడ్డి,కర్నాటి ప్రభాకర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,తమటం దశరథరెడ్డి,ఆవుల శ్రీనివాసులురెడ్డి ఉండేల రామిరెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, కర్నాటి వెంకటరెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, ఉండేల రామకృష్ణారెడ్డి, చిలకల శ్రీనివాసుల రెడ్డి, చిలకల వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN